


# అమ్మ కోరిక

- డొక్కా ఫణికుమార్

*తెలుగు జ్యోతి రచనపోటీలో ప్రథమ బహుమతి పొందిన కథ*
*పురస్కార ప్రదాత: శ్రీమతి ప్రభా రఘునాధన్, బెడ్మినిష్టర్, న్యూజెర్సీ*

మాటల మధ్యలో నాన్న ''ఒరేయ్, ఇదిగో మీ అమ్మేదో అడుగుతుందిట'' అంటూ ఫోను అమ్మకిచ్చారు. ''చెప్పమ్మా, ఏంకావాలి?'' అన్నాన్నేను. ''ఏమీలేదురా చిన్నా, పిల్లలందర్నీ ఓ మాటు చూడాలనుందిరా, వచ్చే వారం దీపావళి కదా, నీకేవైనా ఓ వారం సెలవలు దొరుకుతాయాంటావా?...'' అంది అమ్మ తట పటాయిస్తూ. ''సెలవలు దొరుకుతాయి, టిక్కట్లే చూసుకోవాలి'' అంటుంటే అమ్మ అందుకుని ''అందరూ వద్దులేరా. ఇప్పటికిప్పుడు అన్ని టిక్కెట్లు దొరకడం కష్టమే, పోనీ నువ్వొక్కడివైనా...'' అంతలో వెనకనుంచీ నాన్న అందుకున్నారు ''నీ లౌక్యం మండినట్టే ఉంది, వాడికి నేను చెబుతానుగానీ, నువ్వు కిందకెళ్ళి పాలు పోయించుకో, పాలవాడిందాకణ్ణించీ అరుస్తున్నాడు కాకిలాగా'' అని ఫోను తీసుకుని, కాస్త గొంతు తగ్గించి ''ఒరేయ్ చిన్నా, మనమంతా పది పన్నెండేళ్ళ క్రితం దీపావళి ఎల్లా జరుపుకున్నామో, ఈ సారి దీపావళి అచ్చం అల్లాగే జరుపుకోవాలని మీ అమ్మేదో పిచ్చికోరిక కోరిందిరా. పాపం వెర్రిది, ఎప్పుడూ ఏదీ కావాలని అడగదు, ఏ కళనుందో, అడిగింది కదా అని నేనూ సరేనన్నాను. లండన్ నుంచీ బాబిగాడు, ఆస్ట్రేలియా నుంచీ అమ్మలూ వచ్చే శనివారం వస్తున్నామని నిన్ననే కన్ఫర్మ్ చేసేసారు. ఇహ నువ్వు అమెరికానుంచీ ఈ ఆదివారం దిగడం, పై ఆదివారం వెళ్ళిపోవడం. మనం ఐదుగురమే ఉండాలిట, అదీ విషయం. మళ్ళా ఈ మాటలన్నీ కోడలు దగ్గర అనకు, పాపం బాధపడుతుంది.''



''సరే నాన్నా, నేను మేనేజ్ చేస్తాను. ఇవాళే టిక్కెట్టు బుక్ చేసి, రేపు కన్ఫర్మ్ చేస్తాను మీకు. ఈ కోరికేదో బానే ఉంది.'' అన్నాను నవ్వుతూ.

"అప్పుడే ఏం చూసావు. ఇక్కడ దిగాక చూద్దురుగాని తమాషా. సరే నువ్వు టిక్కెట్టు సంగతి చూసి ఫోను చెయ్యి, ఉంటాను" అంటూ ఫోను పెట్టేసారు నాన్న...

✷✷✷

విమానం కుదుపుకి మళ్ళీ ఈ లోకంలోకొచ్చాను. అప్పుడే హైదరాబాదులో దిగిపోతోంది విమానం. అరగంటలో లగేజీ తీసుకుని బైట కొచ్చేసరికి, దూరంగా చెయ్యూపేస్తూ పట్టుచీర కట్టుకుని అమ్మ, పక్కనే నాన్న. బయట బాబిగాడు అప్పటికే టాక్సీ మాట్లాడేసి ఎదురుచూస్తున్నాడు. "ఎందుకే అమ్మా ఇంత అర్ధరాత్రి నువ్వు రావడం నాకేవైనా కొత్తేవిటే?" అన్నాను.

"మీకు పాతైనా, మిమ్మల్ని రిసీవ్ చేసుకోవడం మాకెప్పుడూ కొత్తేరా బడుద్దాయీ" అంది అమ్మ.

నాన్నతోటీ, అమ్మతోటీ కబుర్లు చెబుతూ "పాపం, అమ్మల్నొదిలేసారేం, దాన్ని కూడా తోలుకొచ్చేయాల్సింది" అన్నాను నవ్వుతూ. అందరం ఇల్లు చేరాం. కబుర్లు చెప్పుకుని పడుకునే సరికి ఏ ఐదో అయ్యింది. మర్నాడందరూ తెమిలేసరికి అపరాహ్ణమైంది. నాన్న చెప్పడం మొదలు పెట్టారు.

"సరే, ఇంక మిగిలిన తమాషా వినండి. రేపట్నించీ మన దినచర్య ఇది. తొమ్మిదిగంటలకల్లా బాబిగాడు సూటూ, బూటూ తొడుక్కుని ఆఫీసుకెళ్ళిపోవాలి. తొమ్మిదింపావుకి... ఒరేయ్ చిన్నా, నువ్వు బేగ్ తగిలించుకుని, ఇంజినీరింగు కాలేజీకెళ్ళిపోవాలి. తొమ్మిదిన్నరకి నేను స్కూటరు మీద అమ్మలునెక్కించుకుని వెళ్ళి, దాన్ని కాలేజీలో దింపేసి, ఆఫీసుకెళ్ళిపోవాలి. అందరికీ అమ్మ లంచ్ బాక్సులిస్తుంది, తీసుకుని వెళ్ళాలి. మళ్ళీ నాలుగింటికి చిన్నా, ఐదింటికి అమ్మలూ, ఆరింటికి బాబీ వెనక్కి రావాలి."
"బావుంది, బావుంది, కానీ అంత సేపు మనం బైట ఏం చెద్దాం?" అన్నాడు బాబి.

"నువ్వు ముందెళ్ళి ఆ మొగలో ఇరానీ హోటలు దగ్గర ఉండు. కాసేపయ్యాకా చిన్నా వస్తాడు కదా, ఇద్దరూ కలిసి ఏ విశాలాంధ్రకో, సంగీత్ సాగర్‌కో పోయి మీక్కావలసిన పుస్తకాలూ, డీవీడీలూ కొనుక్కోండీ. నేనూ, అమ్మలూ షాపింగుకి పోతాం. ఎంతా... సోమ, మంగళ, బుధ.. మూడ్రోజులే. గురువారం దీపావళి, బెంగుళూరులో ఇండియా ఆస్ట్రేలియా క్రికెట్టు మాచ్చీని. శనాదివారాలు మళ్ళీ ప్రయాణాల హడావిడే." అన్నారు నాన్న.

మర్నాడు సోమవారం ఉదయం నేనూ, బాబీ హోటలు దగ్గర కలుసుకున్నాం. "నాన్న శుక్రవారం గురించి చెప్పలేదు, ఎందుకు?" అడిగాన్నేను. "నాకూ అదే అర్థంకావట్లేదు" అన్నాడు చిన్నా. శుక్రవారం గురించి ఎవరు చెప్పగలరో ఆయన దగ్గరికెళ్ళాం. విషయం అర్థమైంది. ఆ తరువాత మూడు రోజులు ఎల్లా గడిచాయో తెలియదు. గురువారం పగలంతా క్రికెట్టు చూస్తూ, గోలచేస్తూ గడిపేసాం అందరం. టీవీ సౌండులో ఒకళ్ళ మాట ఇంకొకళ్ళకి వినపడటమే కష్టంగా ఉంది. అమ్మ అరగంటకోసారి టీ, గంటకోసారి తాయిలాలూ తెచ్చి ఇచ్చింది. మేం వస్తున్నామని స్వయంగా చిచ్చుబుడ్లూ, మతాబలూ, జువ్వలూ కట్టి ఉంచారు నాన్న. రాత్రి మేము అవన్నీ కాలుస్తుంటే, ఇంటిముందు ప్రమిదల్లో దీపాలు వెలిగించారు అమ్మా, అమ్మలూ. ఒక్కసారి అందరం నిజంగానే పదేళ్ళు వెనక్కెళ్ళిపోయాం. ఏదో కాలయంత్రంలో ఎక్కేసి వెనక్కెళ్ళిపోయిన అనుభూతి. అమ్మ కళ్ళలో మెరుపు ముందు దీపాలూ, దివిటీలూ వెలవెలబోయాయి. శుక్రవారం వచ్చేసింది. పదిగంటలకల్లా మామయ్య కారు సిద్ధంగా ఉంది. "ఏమీ లేదురా, మామూలు చెకప్పే, మధ్యానానికల్లా వచ్చేస్తాను" అంటూ బాబిగాణ్ణీ, నన్నూ, అమ్మలునీ ముద్దుపెట్టుకుని కారెక్కింది అమ్మ. పక్కనే నాన్న కూర్చున్నారు. కారు వెళ్ళిపోయింది. వెంటనే అందరం ఫోను దగ్గరికి పరిగెత్తాం. సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి ఫోను చేసి స్పెషలిస్టు డాక్టరుగారితో మాట్లాడాం. 'మీకు తెలుసును కదా, ఈ ఓపెను హార్టు సర్జరీలు మేము ప్రతిరోజూ చేస్తుంటాం. ఏమీ భయపడాల్సిన పనేలేదు. జస్ట్ కొన్ని గంటల్లో పూర్తైపోతుంది. వాల్వ్ కొద్దిగా బ్లా కయ్యాయి, సోమవారం చెప్పాను కదా, డోంట్ వర్రీ, ఉయ్ విల్ టేక్‌కేర్." అన్నారు మా వీధిలో కాపురముండే డాక్టర్ కృష్ణారావుగారు. ఆపరేషన్ పూర్తైంది. శనివారం ఉదయానికల్లా అమ్మ మాట్లాడగలిగింది.

"ఏరా చిన్నా, మీకు ముందే తెలుసునా?" అంది అమ్మ అనుమానంగా.

"లేదే, తెలియదు" అన్నాన్నేను,

"ఉత్త వెధవలు మీరిద్దరూ తోడు దొంగలు, మీకు తెలిసే ఉంటుంది..." అంది నవ్వుతూ.

రాత్రైంది. నాన్నా, అమ్మలూ ఇంటికెళ్ళారు. బాబిగాడు కాఫీ తీసుకురావటనికి కిందకెళ్ళాడు. అమ్మ పక్కనే నేనున్నాను.

"చిన్నా.. మీరంతా అమ్మ ఇలా ఎందుకు చేసింది? అనుకుంటున్నారు కదా. చెబుతా విను. మొన్న దసరా రోజున గుళ్ళో లలితా సహస్రం చదివొస్తుంటే ఉన్నట్టుండి ఆయాసమొచ్చేసి, ఊపిరందకపోతే, నాన్న మన కృష్ణారావుగారికి చూపించారు. ఆయనేమో రెండురోజులు పరీక్షలన్నీ చేసి, ఆపరేషనన్నాడు. గుండె ఆపరేషనంటే ఏవైనా జరగచ్చును కదా, అప్పుడు నా కనిపించింది - నేను చచ్చిపోతే ఎలాగా? అని. చావందరికి వస్తుంది, కానీ, అదీ ప్రశాంతంగా, కోరికలు తీరినవాడికొస్తే అందరికీ హాయి - అనుకున్నాను. నాకింకా తీరని కోరికలేమిటా అని చాలా ఆలోచించాన్రా. ఏమీ తట్టలేదు. నాకన్నింటికన్నా నచ్చిన పనేదైనా చెయ్యాలనిపించింది. అదేమిటో తెలుసా, మా నాన్న గుండెలమీదెక్కి ఆయనతో ఆడుకోవడం. ఇప్పుడు నేను ఆయన దగ్గరకెళ్ళే వయసే గానీ, ఆయన రాలేరుగా, అందుకే దాని తరువాత ఇంకేమిటిష్టమా అని ఆలోచించాను. మీతోటీ, నాన్నతోటీ సమయం గడపడం ఇష్టమనిపించింది. అందునా బాబిగాడికి ఉద్యోగం వచ్చేసి, నీ ఇంజినీరింగు పూర్తైపోతున్న రోజులు తిరిగి ఒక్కసారి గడపాలనిపించింది. ఎందుకంటే, - వాడు సెటిలైపోయాడు, నువ్వింజినీరైపోయి సెటిలైపోతావనే ధైర్యం, అమ్మల్ని చూసుకోవడానికి నాన్న, అందొచ్చిన ఇద్దరు అన్నలూ ఉన్నారనే ధైర్యం, ఒక భద్రతా భావం. దేనికీ లోటులేని ఒకగొప్ప జీవితాన్ని నాకిచ్చాడురా దేవుడు. దేవుడులాంటి మీ నాన్ననీ, దేశాల్లేలే బిడ్డల్నీ - బంగారమంటి కుటుంబాన్నిచ్చాడు దేవుడు. అందుకే ఆయనకి కృతజ్ఞత చెప్పుకోని రోజు లేదు. ఈ ఆపరేషను పుణ్యమా అని నాకేదైనా అయితే, అయ్యో అమ్మని చూడలేకపోయామేనని మీరంతా బాధపడతారని రమ్మన్నాన్రా. అందరినీ ఇబ్బంది పెట్టడం ఇష్టం లేకే, మిమ్మల్ని మాత్రమే రమ్మన్నది. మరేం కాదురా. మిమ్మల్ని పొద్దున్నే బయటకి పంపేయడం, సాయంత్రం రమ్మనడం, లంచిబాక్సులివ్వడం ఇవ్వన్నీ పిచ్చి పనులే. కానీ ఆ పనులు ఎం...త ఆనందాన్నిచ్చాయో మీకు తెలీదురా. ఈ నాలుగురోజుల్లోనూ నేను జీవితంలో ఆనందాన్నంతా అనుభవించేసాన్రా. ఇహ ఇప్పుడూ ఆ పైవాడు ఎప్పుడు రమ్మంటే అప్పుడు రెడీ... సరే, కొంచెం నిద్దరొస్తోంది, బాబిగాడొస్తే ఇద్దరూ కాస్త కాఫీ తాగి, అలా బైట తిరిగిరండి, ఇంకేం భయంలేదులే" అంటూ నిద్రలోకి జారుకుంది అమ్మ. అమ్మ ఎంత పిచ్చిది!!

ఈ ప్రపంచమంతా అల్లాంటి పిచ్చివాళ్ళతో నిండిపోతే ఎం...త బాగుండును!!

✷✷✷

*శ్రీనివాస ఫణికుమార్ స్వస్థలం అమలాపురం. హైదరాబాదు సెంట్రల్ యూనివర్సిటీ నుంచి* M.S. Solid State Physics, SPSU(Atlalanta) *నుంచి* M.S.Computer Science *చేశారు. ప్రస్తుత నివాసం అట్లాంటా. ఇ-మెయిల్* phanidokka@yahoo.com

